క్లుప్తంగా

నేడు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నియోజకవర్గంలోని జి.కొండూరు మండలం వెంకటాపురంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు మైలవరం మండలం చంద్రగూడెంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణంతో పాటు సిమెంట్ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఐదు గంటలకు మొర్సుమల్లిలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

రెండు గ్రాస్ కట్టర్ల కొనుగోలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో రోడ్లు వెంట ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల తొలగింపునకు రెండు గ్రాస్ కట్టర్లు కొనుగోలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశాలు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో రూ.60వేలతో కొనుగోలు చేసిన రెండు గడ్డి తొలగింపు మిషన్‌లను మంగళవారం కార్యాలయంలో ప్రదర్శించారు. ఒక మిషన్ కొండపల్లి ప్రాంతంలో, మరో మిషన్ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో వినియోగిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఏఈ సాయిగణేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

తారకనాథ్‌కు ఘన నివాళి



గంపలగూడెం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ మాజీ జనరల్ సెక్రటరీ తారకనాథ్ 19వ వర్ధంతిని గంపలగూడెంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద స్టాఫ్ యూనియన్ రీజినల్ సెక్రటరీ బి.ఎల్.హెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తారకనాథ్ చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ తోట బాబురావు, అకౌంటెంట్ సత్తిబుజ్జి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంస్థలో అన్నదానం

ఇబ్రహీంపట్నం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ పూర్వపు కార్యదర్శి వై.తారక్‌నాథ్ వర్ధంతిని ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించారు. తారక్‌నాథ్ చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రేమ్‌నికేతన్ దివ్యాంగుల సంస్థ, కాచవరం అమ్మనాన్న వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. విజయవాడ మాడ్యూల్ డీజీఎస్ భవానీశంకర్, యూనియన్ కార్యదర్శులు కోగంటి వీరారావు, శ్రీకాంత్, బ్యాంక్ సిబ్బంది కుసుమ, నాగరాజు, పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



తిరువూరు: స్థానిక కోదండరామాలయంలో మంగళవారం ఆషాఢమాస సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్రస్వామికి, ఆళ్వార్లకు తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సోమవరపు సత్యనారాయణ పర్యవేక్షించారు.

కట్టలేరుపై హైబ్రిడ్జి నిర్మించాలి

గంపలగూడెం: తోటమూల–గంపలగూడెం గ్రామాల నడుమ కట్టలేరుపై హైబ్రిడ్జి నిర్మించాలని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణాన్ని కోరుతూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం చేపట్టిన పాదయాత్రను ఆయన కనుమూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలం క్రితం కట్టలేరుపై నిర్మించిన లో లెవల్ బ్రిడ్జి ఐదు సంవత్సరాలు క్రితం ధ్వంసం కాగా నూతన వంతెనను నిర్మించడంలో జాప్యం కారణంగా పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇక్కడ సమస్యను గుర్తించి వెంటనే తగిన నిధులను కేటాయించి హైబ్రిడ్జి నిర్మించాలని కోరారు. డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, నాయకులు గువ్వల సీతారామిరెడ్డి, వీరారెడ్డి, చిన్న సత్యంబాబు, మీసాల గోపి, జి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే సత్తా కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే ఉందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మార్ అప్పారావు కాలనీకి 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అన్నవరం సబ్‌స్టేషన్‌లో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ బ్రేకర్‌ను, గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన రూ.13 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, రూ.20.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే అతిపెద్ద కాలనీ అయిన ఎమ్మార్ అప్పారావు కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మార్ అప్పారావు కాలనీని 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని, నేడు ఈ కాలనీలో ఐదువేల మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. కాలనీలో రహదారులన్నింటినీ అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలబడాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. అమ్మ ఒడి, ఆణిముత్యాలు, జగనన్న విద్యాకానుక, వసతిదీవెన, విద్యాదీవెన, రైతు భరోసా, వాహనమిత్ర, మహిళలకు సున్నావడ్డీ, రుణమాఫీ తదితర అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అంతేగాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలను ఇవ్వడమే కాకుండా 20 లక్షల మందికి పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. స్థానిక సంస్థలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు.



అన్నవరం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ బ్రేకర్‌ను పారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అధోగతే

చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అధోగతేనని, ప్రస్తుతం అమలవుతోన్న సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తాడని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి ఆరు హామీలను కూడా అమలు చేయని వ్యక్తి చంద్రబాబు అని, 14ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసి పేదలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కూడా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, ఏపీసీపీడీసీఎల్ డీఈ దుర్గారావు, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు గిరీష్, మారు అప్పాజీ, రాంబాబు, రజియాబేగం, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు చరణ్, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాధవి, నాయకులు మస్తాన్, నాగేశ్వరరావు, రవీంద్రరెడ్డి, నౌషి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం



కొండపల్లిలో విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈఓ పుష్పలత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టెన్త్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంఈఓ సీహెచ్ పుష్పలత అన్నారు. కొండపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన నగదు ప్రోత్సాహం మంగళవారం అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన షేక్ రెహాన్ షరీఫ్ – 550, ప్రణీత్ – 524, కూరపాటి దీపక్ – 513 ముగ్గురితో పాటు తల్లిదండ్రులను నగదు, సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు. సోషల్ ఉపాధ్యాయుడు బాబురావు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున తన సొంత నిధులు అందించి ప్రోత్సహించారు. హెచ్‌ఎం ఎం వీ.శేషగిరిరావు, పీఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరికరాల సరఫరా



తిరువూరులో వ్యాధిగ్రస్తుల సర్వే

తిరువూరు: బోదకాలు, కుష్టు వ్యాధుల బారిన పడిన వారికి స్వయం సంరక్షణ పరికరాలను ఉచితంగా అందజేయనున్నట్లు లెప్రా సొసైటీ ఔట్‌రీచ్ వర్కర్ పీ చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని మధిరరోడ్డు ప్రాంతంలో వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఆ సంస్థ సిబ్బంది మంగళవారం ఇంటింటికీ తిరిగి కుష్టు, బోదకాలు బాధితుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఆయా వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇప్పటివరకు పట్టణంలో 56 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించామని, త్వరలో స్వయం సంరక్షణ శిబిరాలు నిర్వహించి రోగులకు అవసరమైన క్రేప్ బ్యాండేజీలు, ఈవా చెప్పులు, ఆయింట్‌మెంట్లు, లిక్విడ్స్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

నూతన విద్యావిధానంలో కోర్సులు ప్రారంభం



సుశీలరావు

తిరువూరు: కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానానికి అనుగుణంగా తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పలు మార్పులతో డిగ్రీ కోర్సులలో విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులు తమకు కావలసిన కోర్సులో చేరడానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సులు సింగిల్ మేజరుగా మారాయని, ప్రతి ప్రోగ్రాంలో ఇప్పటివరకు ఉన్న మూడు మేజరు సబ్జెక్టులకు బదులుగా సింగిల్ మేజరు సబ్జెక్టుగానూ, ఒక మైనర్ సబ్జక్టును ఎంచుకోవాలని సూచించారు. తమ కళాశాలలో బీఏ డిగ్రీలో హిస్టరీ మేజరు సబ్జక్టుగా, ఎకనామిక్స్ మైనర్ సబ్జక్టుగా ఎంచుకోవాలని తెలిపారు. బీకాం డిగ్రీలో కంప్యూటర్ అప్లికేషన్స్ మేజరు సబ్జక్టుగా, ఎకనామిక్స్ మైనర్ సబ్జక్టుగా, బీఎస్సీలో కంప్యూటర్ సైన్స్ మేజరు సబ్జెక్టుగా, లెక్కలు మైనర్ సబ్జక్టుగా, బీఎస్సీలో జువాలజీ మేజర్ సబ్జక్టుగా, బోటనీ మైనర్ సబ్జక్టుగా ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తామని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు

తిరువూరు: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం కింద రాయితీపై బిందు సేద్యం, సూక్ష్మ సేద్య పరికరాలను రైతులకు సరఫరా చేయనున్నట్లు తిరువూరు ఉద్యానవన అధికారి సోహెల్ అహ్మద్ తెలిపారు. ఐదు ఎకరాల లోపు చిన్న, సన్నకారు రైతులకు 90శాతం రాయితీపై గరిష్టంగా రూ.2.18 లక్షల వరకు, ఐదు ఎకరాలు పైబడిన పొలం ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై గరిష్టంగా రూ.3.10 లక్షల రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పొందవచ్చని తెలిపారు. తుంపర సేద్యం పరికరాలకు చిన్న, సన్నకారు రైతులకు 55శాతం, పెద్ద రైతులకు 45శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. గతంలో ఈ పథకంలో లబ్ధిపొంది ఏడు సంవత్సరాలు దాటిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులని తెలిపారు. సూక్ష్మ, బిందు సేద్య పరికరాల ఏర్పాటు ద్వారా సాగునీటిని పొదుపు చేయవచ్చని పేర్కొన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహన

విస్సన్నపేట: నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2023 ప్రకారం ఈ విద్యాసంవత్సరం నుంచి ఆనర్స్ డిగ్రీ -సింగిల్, మేజర్ సబ్జెక్టులను ప్రవేశ పెట్టనున్నారు. ఈ నాలుగు సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ కోర్సులకు సంబంధించి స్థానిక వికాస్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ నర్సిరెడ్డి మంగళవారం తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ డీన్, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డాక్టర్ రామశేఖరరెడ్డి, ట్రైలాజిక్ సాఫ్ట్ సొల్యూషన్ ఎండీ రవికుమార్ డిగ్రీ ఆనర్స్ కోర్స్‌లపై అవగాహన కల్పిస్తారన్నారు.

నూటికి నూరుశాతం రుణాలు వసూలు



ఏ.కొండూరు: మండలంలోని కోడూరులోని పీఏసీఎస్‌లో రైతులకు అందించిన వ్యవసాయ రుణాలు నూటికి నూరుశాతం వసూలు చేసినట్లు పీఏసీఎస్ సీఈఓ జి. జమలారెడ్డి మంగళవారం తెలిపారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందించిన వ్యవసాయ రుణాలు వరుసగా నాలుగోసారి రూ.12.12 కోట్లు వసూలు చేశామని పేర్కొన్నారు. రుణాల వసూళ్లకు సహకరించిన పీఏసీఎస్ సిబ్బంది, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ పి. సత్యనారాయణను పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి అభినందించారు.

ప్రతి ఇంటికీ వెళ్లి అవసరాలను గుర్తించాలి

గంపలగూడెం: వలంటీర్లు, గృహ సారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు అవసరాలను గుర్తించాలని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంపలగూడెం సచివాలయంలో వలంటీర్లు, గృహసారథులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయా కుటుంబాలకు సంబంధించిన గుర్తించిన సమస్యలు, అవసరాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో తీర్చడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. సిటిజన్స్‌కు సంబంధించిన జనన ధ్రువీకరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, రెవెన్యూ, ఆధార్‌సేవలు, మ్యారేజ్ సర్టిఫికెట్లు మొదలగు సేవలకు సంబంధించిన సమస్యలను ఈ క్యాంప్‌లో పరిష్కారం చేయాల్సి ఉందన్నారు. అన్ని గ్రామ సచివాలయాల్లో జూలై ఒకటో తేదీన క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

తిరువూరురూరల్: జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయడానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషిచేయాలని మండలంలోని అంజనేయపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు కోరారు. గ్రామ సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై జగనన్న సురక్ష పథకంలో సమాచారం సేకరించాల్సి ఉంటుందన్నారు. మండలంలోని ఎర్రమాడు సచివాలయంలో కూడా జగనన్న సురక్ష పథకంపై సిబ్బందితో జరిగిన సమావేశంలో సర్పంచి మాధవి పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: జగనన్న సురక్షకు సంబంధించి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ మోతీయా పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: ప్రభుత్వం 'జగనన్న సురక్ష' పథకం పేరుతో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దకే అందించేందుకు చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి స్థానిక కమ్యూనిటీ హాలులో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ రోహిణీదేవి, సర్పంచ్‌లు రామారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌కు జాతీయ పురస్కారం

ఆగిరిపల్లి (నూజివీడు): ఆగిరిపల్లి మండలంలోని ఎస్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎన్‌వీ సురేంద్రబాబుకు దక్షిణ భారతదేశంలోనే అత్యంత చురుకైన ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా పురస్కారం లభించిందని ఆ కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్‌రావు తెలిపారు. చెన్నైలో నిర్వహించిన ఈ సదస్సులో హిమాలయన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రకాష్ దివాకరన్ చేతుల మీదుగా సురేంద్రబాబు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్లేస్‌మెంట్ రంగంలో విద్యార్థులకు 7,000కు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినందుకు ఈ అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబును చైర్మన్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్లు, డీన్లు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

• ప్రతిభకు పట్టం



క్విజ్ చాంపియన్‌షిప్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న శ్రావణ్ సాయికుమార్



క్విజ్ చాంపియన్‌షిప్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న పి.నీలేష్

విద్యా రంగంలో రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్కరించారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్లో మంగళవారం రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సమస్యల పరిష్కారానికే సచివాలయ వ్యవస్థ

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలకు బ్రోచర్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గ్రామీణాభివృద్ధికి, పేదల సంక్షేమానికి చేస్తున్న కృషిని వివరించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలు సత్వరం పేదలకు అందుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సైతం ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఇంకా లబ్ధిపొందని అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, కొమ్మిరెడ్డిపల్లి సర్పంచ్ బంకా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు బండి రవికుమార్, తాళ్లూరి నవీన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు నన్నక లోకేశ్వరరావు, బంకా ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారీ వర్షం, రోడ్లు జలమయం



మైలవరంలో కురిసిన వర్షానికి జలమయం అయిన రహదారి



చాట్రాయిలో నల్లటి మేఘాలతో ఆకాశం

మైలవరం: మైలవరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ప్రజలు ఇబ్బందులు పడగా మధ్యాహ్నం రెండు గంటలకు కారు మబ్బులు పట్టి, సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడిన ప్రజలు ఒక్కసారిగా వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. తొలకరి వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇక వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది.నెల రోజులుగా తీవ్ర వేసవి ఎండలతో అల్లాడిపోతున్న ప్రజానీకం వర్షం రాకతో కొంత ఉపశమనం పొందారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తబ్బిబ్బయ్యారు. ఒక్కసారిగా వాతావరణం మారి ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. రెండు గంటల పాటు వర్షం కురిసింది.

చల్లబడిన వాతావరణం

చాట్రాయి: మారిన వాతావరణంతో భగ్గుమంటున్న ఎండలు చల్లబడ్డాయి. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండలకు ప్రజలు బెంబేలెత్తారు. దీనికి తోడు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో చిరు జలుల్లు పడడంతో ప్రజలు సేద తీరారు.

పంట సాగుదారుల హక్కుల పత్రంపై అవగాహన

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి రైతు భరోసా కేంద్రంలో పంట సాగుదారుల హక్కుల పత్రంపై కౌలు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ ఓనర్ రైతు కౌలు రైతు మధ్య గ్రామ రెవెన్యూ అధికారి సమక్షంలో ఒప్పందం చేసుకోవాలన్నారు. తద్వారా ఈ–కార్డ్ పొందవచ్చని తెలిపారు. ఈ–కార్డ్ పొందిన కౌలు రైతుకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఎటువంటి హక్కు ఉండబోదని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్క కౌలు రైతు కౌలు కార్డు తీసుకోవాలని, దీనికి ఓనర్ రైతులు సహకరించాలని తెలిపారు. ఈకార్డ్ పొందిన వారికి ఈ క్రాప్ పంట నమోదు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సాగు భూమిలేని కౌలు చేస్తున్న రైతులకు వైఎస్సార్ రైతు భరోసా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు అట్లూరి శ్రీనివాసరావు, దేవుళ్ల జమలయ్య, మద్దిరెడ్డి జమలారెడ్డి పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

నూజివీడు: మండలంలోని సుంకొల్లు, దేవరగుంటలలో రూరల్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 లీటర్ల సారా, 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రావిచర్లలో 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వాటిని కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో హెల్ప్‌డెస్క్ సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లలో భాగంగా హెల్ప్‌డెస్క్ సేవలు ప్రారంభమయ్యాయి. హెల్ప్ డెస్క్ ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఏ విధంగా దరఖాస్తులు చేసుకోవాలి, కళాశాలలో ఉన్న కోర్సులు ఏమిటి అన్న వివరాలపై అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం సుమారు 50 మంది విద్యార్థులు హెల్ప్‌డెస్క్ ద్వారా కోర్సుల వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలలోని హెల్ప్‌డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు.